# మూడునాళ్ల ముచ్చట

'అంటూ సొంటూ గంగలో కలిపేశావు' అని అమ్మ సాధిస్తుంది నన్ను. కాని, కలిపింది గంగలో కాదు—అన్నయ్య ఇంట్లో—హుస్సేన్ సాగర్ ఒడ్డున. 'అంటుకోనిది అంటుకాదు' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించినది అన్నయ్యే. అన్నంగిన్నె ముట్టుకున్నా చేతికి ఏమీ అంటుకోకపోతే చెయ్యి కడుక్కోనక్కర్లేదు. నేతిగిన్నె ముట్టుకున్నా చేతికి జిడ్డు తగిలితే సబ్బుపెట్టి కడుక్కోవాలిగాని, చీరకి పూసేసుకో కూడదు-అని అన్నయ్య వాదన.

అన్నయ్య అమెరికాలో చదువుకుని భారత్‌కి తిరిగి వచ్చిన బాపతు అప్పటి నుంచీ ఆంధ్రుల ఆచార వ్యవహారాలంటే అసహ్యం. అమెరికా నుండి సంక్రాంతి రోజుల్లో తిరిగివచ్చాడు స్వగ్రామానికి. నేను ఇంట్లో గొబ్బెళ్ళు పెడుతున్నాను ఉదయాన్నే. బ్రష్ నోట్లో పెట్టుకుని కుళాయి దగ్గర కొచ్చాడు అన్నయ్య. నన్ను చూసి పాకీదొడ్లో పందిని చూసినట్లుగా మొహం పెట్టాడు. 'ఛీ, ఏమిటే ఆ పేడముద్దలూ నువ్వూను' అన్నాడు. నేను నవ్వుతూ 'పేడముద్ద లేమిటి! గొబ్బెళ్ళు' అన్నాను. 'గొబ్బెళ్ళేమిటే స్కూలు ఫైనలు చదువుతూ ! నీకు 'సుజాత' అని పెట్టారు గాని నాన్న

గారు సుబ్బమ్మ అని పేరు పెట్టాల్సింది' అన్నాడు వెటకారంగా. మా బామ్మ అటువైపుగా వచ్చి 'ఏమిటిరా అబ్బిగా, సుబ్బమ్మ కేమొచ్చింది-నిక్షేపంలాంటి పేరు' అని సాగదీసింది. ఆవిడ పేరు సుబ్బలక్ష్మమ్మ.

నాకు స్కూలు ఫైనలు కాగానే పెళ్ళిచెయ్యాలని సంకల్పించారు అమ్మ, నాన్నగారు. 'నేను కళ్ళుమూసేలోపలే దానికి మూడుముళ్ళూ వేయించరా' అని బామ్మ పోరొకటి. నాకు కాలేజీలో చేరాలని ఆకాంక్ష. అన్నయ్య నన్ను సమర్థిస్తూ నాన్నగారితో వాదించాడు-'పదిహేనేళ్ళు నిండాయో లేదో అప్పుడే దానికి పెళ్ళేమిటి నిక్షేపంలా చదివించక' అని. 'ఇప్పుడు అది చదువుకుని ఉద్యోగాలు చెయ్యాలా ఊళ్ళేలాలా? చాల్లెద్దూ, చాకలిపద్దు వేయటానికి ఆ చదువు' అని అమ్మ అడ్డుపుల్ల వేసింది. అయినా అన్నయ్య అభ్యుదయవాదమే గెలిచింది. చివరికి నాన్నగారు నన్ను చదివించడానికి ఒప్పుకున్నారు.

ఇంట్లో ఊరికే కూర్చుని మాత్రం ఏం చేస్తుంది? సంబంధం ఇప్పుడేమీ సిద్ధంగా లేదు కదా, కుదిరేదాకా చదవనీ' అన్నారు నాన్నగారు. అప్పుడిక అమ్మకి ఆట్టే అభ్యంతరం కనిపించలేదు.

అన్నయ్యకి హైదరాబాదులో ఉద్యోగం అయింది. సెలవుల్లో నన్ను రమ్మంటే వెళ్ళాను. టాంక్‌బండ్, ఆబిడ్స్‌రోడ్, పబ్లిక్‌గార్డెన్స్, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియమూ చూపించారు అన్నయ్యా, వదినా కలిసి.

ఆదివారంనాడు మధ్యాహ్నం పేకాడుతున్నాం కూర్చుని. అలవాటు లేకపోవడం వల్ల నేను ఒక్క ఆటా గెలవలేదు. అయినా పట్టుదలగా ఆడుతున్నాను. అన్నయ్య, వదిన కూడా ఒకరినొకరు ఓడించాలని దీక్షగా ఆడుతున్నారు--మధ్యమధ్య సరసాలాడుతూ. ఆట మధ్యలో నేను

ఇవతలికి వచ్చేశాను. ఎంతకీ ఆటలో కలవకపోయేసరికి అన్నయ్య గట్టిగా పిలిచాడు. వరండాలో నించున్నాను నేను. రెండుసార్లు పిలిచి, ఎంతకీ రాకపోయేసరికి వదినని లేపాడు పిలుచుకు రమ్మని. వదిన అక్కడే కూర్చుని 'ఈసారి నువ్వే గెలుస్తావులే, రా సుజాతా' అని గట్టిగా అభయ మిచ్చింది. 'ఊఁహూఁ. ఇంక ఇప్పుడు ఆడను' అన్నాను అక్కడే వరం డాలో నిలుచుని. ఈ సారి అన్నయ్యే లేచివచ్చాడు. 'ఏమే ఉడుకుమోతూ, ఆడతావా లేదా' అన్నాడు నవ్వూ, బెదిరింపూ మిళాయించి. 'అది కాద న్నయ్యా, ఇప్పుడింక ఆడటం కుదరదు' అన్నాను వెనక్కి జరుగుతూ. 'ఏమ్మా, ఎందుకు కుదరదూ' అంటూ నా చెయ్యి పట్టుకోబోయాడు. చటు క్కున వెనక్కి వెళ్ళిపోయి మూలగా నక్కినట్లు నిలుచుని 'ముట్టుకోకు దూరంగా ఉండు' అన్నాను. ఈ హడావిడికి వదిన కూడా ఇవతలి కొచ్చింది, 'ఏమిటి, సుజాతా' అంటూ. చూస్తూనే గ్రహించుకుంది. ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నయ్యవైపు చూసి 'మీకు బొత్తిగా ఆచారం లేదు' అంది. అన్నయ్యకి అర్థమయింది క్షణంలో. 'అమ్మయ్య' అనుకుంటున్నాను--అంతలోనే అన్నయ్య 'ఇటువంటి పిచ్చిపిచ్చి వేషాలు మానేయ్. ఇవతలికి రా--ఈసారి ఇలా చెప్పావంటే ఊరుకోను. ఇలాంటి అమ్మమ్మ వ్యవహారాలు మా ఇంట్లో కుదరవు' అన్నాడు. వదినవైపు బెరుగ్గా చూశాను. వదిన నవ్వుతూ అలాగే నిలబడింది. 'రేపు కాలేజీలో చేరితే ఏం చేస్తావే? క్లాసులోకూడా ఇలాగే నన్ను ముట్టుకోకండి అంటూ దూరంగా కూర్చుంటావా? లేకపోతే నెలనెలా క్లాసులు ఎగ్గొడతావా?' అన్నాడు అన్నయ్య ఉద్రేకంతో. 'మీ ఇంట్లో సరే. అక్కడ అమ్మ ఊరుకోవద్దూ---ఇంట్లో కలిపేస్తే ఇంకేమన్నా ఉందా' అన్నాను. 'అమ్మ దగ్గర ఏ గొబ్బెమ్మలా పడుంటావో నాకు తెలియదు. ఇక్కడ మాత్రం బయట ఉండటానికి వీల్లేదు' అన్నాడు.

ఆ సెలవులు రెండునెలలూ పంజరంలోంచి బయటపడిన పక్షిలా హాయిగా ఉన్నాను. ఏదో కొత్తలోకంలో ఉన్నట్లు అనిపించింది.

నేను కాలేజీలో చేరాక ఒక కొత్త సమస్య ఎదురైంది ఇంట్లో అందరికీ---ముఖ్యంగా అమ్మకి. స్కూల్లో చదువుతున్నప్పుడు ఆ మూడు రోజులూ నాచేత సెలవు పెట్టించారు. అది కూడా రెండు మూడు సార్లే జరిగింది. కాబట్టి చదువుకి ఇబ్బంది కలగలేదు. కాలేజీలో చేరాక క్లాసులు మానెయ్యాలంటే నాన్నగారికి కూడా నచ్చలేదు. ఆయనకి స్వతహాగా చదువంటే ఇష్టం. నేను శ్రద్ధగా చదువుకోవటం చూసి ఆయనకి కూడా ఉత్సాహం కలిగింది. నేను కూడా డిగ్రీ సంపాదించాలని ఆయనకి గట్టి కోరిక కలిగింది. సంబంధాలు చూడటం కూడా మానేశారు. అమ్మ నెలనెలా అవతల కూర్చుంటే నాన్నగారుకూడా వంటలో నాకు సాయం చేసేవారు-నాకు కాలేజీకి ఆలస్యం అవకుండా. సరిగ్గా నా పరీక్షల సమయంలో కూర్చోవటం అమ్మకి అలవాటు. పాపం నా చదువు పాడవుతుందని నాన్న గారే వంట చేసుకునేవారు. అది అమ్మ అయినప్పుడు. నావంతు వచ్చి నప్పుడల్లా, అమ్మ సణుగుడికి అంతు ఉండేది కాదు. పొద్దున్న, సాయం కాలం మడికట్టుకుని వంటింట్లో కూర్చునేది. నాకు చీర, రవిక, లోపలి పరికిణీ, బాడీ, సబ్బు, తువ్వాలు. అద్దం, దువ్వెన్న, నూనె, బొట్టు---ఇవన్నీ అందించాలంటే విసుక్కునేది. 'ఈ వెధవ చదువులు వచ్చి నా ప్రాణాలు తీస్తున్నాయి- అయినదానివి ఓ మూల పడి ఉండక ముస్తాబు కూడాను-కాకపోయినా, బొట్టు పెట్టుకోవటం ఏమిటి చెప్పేవాళ్ళు లేకగాని' అంటూ సాధించేది. రోజూ బొట్టుపెట్టుకొని మూడురోజులు పెట్టుకోకపోతే కాలేజీలో అందరికీ తెలిసిపోతుందన్న భయం నాకు. రోజూ ఇస్త్రీ మడత చీర కట్టుకుని కాలేజీకి వెడుతూ, మూడు

రోజులు విప్పిన చీరలు కాని, ఒకే చీరగాని కట్టుకుని వెడితే రహస్యం బయటపడిపోతుందని భయం నాకు.

ఒక్కమండి- ఒక్కోసారి వాదించేదాన్ని-అంతమంది ఆడపిల్లలు చదువుతున్నప్పుడు ఎవరో ఒకరు ఆ పరిస్థితిలో రోజూ ఉండక మానరు. నేనొక్కర్తినీ ఇంట్లో వేరుగా కూర్చుంటే మాత్రం ఏం లాభం? నెల పొడుగుతా కలుస్తూనే ఉందికదా-అనేదాన్ని. 'ఒకళ్ళ గొడవ మనకెందుకు? ఎరగనిపాపం ఏట్లో కలిసిందిట. కాకపోయినా నువ్వు అందరినీ రోజూ ముట్టుకురావటం ఎందుకు ?' నీ సీట్లో నువ్వు చదువుకుని తిన్నగా ఇంటికి రాలేవూ?' అని అమ్మ వాదన.

అమ్మ మంచిమూడ్‌లో ఉంటే చూసి మరింత ధైర్యంగా వాదించే దాన్ని. 'ఏమిటి నీ చాదస్తం మరీను! బస్సులో వెడుతూంటే నలుగురూ తాకరూ? నన్ను ముట్టుకోకు నామాలకాకి అని ఎలా తిరగటంనలుగురిలో?'

'అందుకే వెధవ చదువు మానేసి నిక్షేపంలా ఇంటిపట్టున ఉండ మన్నాను' అంది అమ్మ.

'ఇంట్లో మాత్రం ఏముంది? ఆ మూడు రోజులూ దూరంగాఉంటే సరిపోయిందా? ఆ తరువాత ఇంట్లో తిరిగితే తప్పులేదా?' అని అడిగాను.

'చాల్లే నీ వితండవాదం. మరీ హద్దు మీరి పోతున్నావు. అంటూ సొంటూ అన్నీ గంగలో కలిపేస్తున్నావు. రేపు అత్తవారింట్లో ఇలా చేశా వంటే ఇహ పరువూ మర్యాదా ఉండవు' అని వార్నింగ్ ఇచ్చింది అమ్మ.

నా వల్ల ఇంట్లో అనాచారం ప్రబలుతున్నదనే అపోహతో అమ్మ తన ఆచారాన్ని మరింత పటిష్ఠం చేసుకోవటం మొదలుపెట్టింది. ఇప్పుడు తన దృష్టి పనిమనిషి మీదికి కూడా పోయింది. ఇది వరకు మా ఇంట్లో

ఒక ముసిల్ది చేసేది పని. దానికి పక్షవాతం వచ్చాక కోడలు పనిలోకి రావటం మొదలుపెట్టింది. కోడలు వయసులో ఉంది. దాన్ని చూడగానే చెప్పింది మా అమ్మ 'ఏమేవ్, మా ఇంట్లో మడీ, ఆచారం-ఆ మూడు రోజులూ పనికి నువ్వు రావద్దు-చెప్పకుండా వచ్చేవు కనుక' అంది. ఆ పనిమనిషి కనకాలుకి అంతకన్న ఏం కావాలి? అది ఎంతో వినయ విధేయతలతో 'అదేమిటమ్మగోరూ, సెప్పాలా-మీరొద్దన్నాక ఇహ మళ్ళీ అట్టాంటి పాచిపని సేస్తానేటి' అంది. అమ్మ సంతోషించింది. కాని ఆ సంతోషం అట్టేకాలం నిలవలేదు. కనకాలు ఇరవైరోజుల కొకసారి వీధిలోంచి పొలికేక పెట్టేది-'శాంతమ్మగోరూ, నాను ఇంటోకి రాకూడదండి. సానం అయినా కొస్తాను' అని సమాధానం ఆశించకుండా చక్కా-పోయేది. అమ్మ ఇక చిందులు తొక్కే-ది వంటింట్లో—'వెధవ దొంగపీనుగ—పని ఎగ్గొట్టడానికి ఎత్తుగాని, నిజంగా అయిఉండదు' అని. అదే అదనుకదా అని నేను అందుకుని 'నువ్వే దానికి నేర్పి పెట్టావుగా, ఇప్పుడు అనుభవించేది మనమేకదా, అయినా ఇంత ఆచారం పెట్టుకుంటే కష్టం బాబూ' అని. అమ్మ మారలేదు సరికదా, పైగా నామీదే విరుచుకుపడింది 'నువ్వొచ్చాకే కొంప మైలపడిపోతోంది' అని.

అమ్మ మాటలు వింటూంటే అప్పుడప్పుడు అనిపించేది-హాయిగా పెళ్ళి చేసుకుని స్వతంత్రంగా ఉండిపోతే బాగుండునని. కానీ, రాబోయే అత్తగారూ మామగారూ ఎటువంటివాళ్ళో ఊహించుకోవటానికి ధైర్యం చాలక చదువుపైకి దృష్టి మళ్ళించాను.

ఓ రోజు సాయంకాలం కాలేజినుంచి ఇంటి కొస్తున్నాను, నీరసంగా నడుస్తూ. నాన్నగారి స్నేహితుడు ప్రకాశరావుగారు ఎదురు వచ్చారు. నన్ను చూడగానే ఆగిపోయి, ఆప్యాయంగా పలక

రించారు. 'ఏం చదువుతున్నావ్' అన్నారు. 'బి.యె.అండీ' అన్నాను. 'అబ్బో, అప్పుడే బి.యె.లో కొచ్చావా? నిన్న మొన్నటి దాకా గౌన్లు వేసుకు తిరిగేదానివి' అన్నారు నా వీపుమీద చరుస్తూ. నేను గతుక్కు మన్నాను నా పరిస్థితి గురుతొచ్చి. చెబితే ఆయన ఇంటికెళ్ళి నెత్తినిండా స్నానం చేస్తారేమో! చేతిలో కాఫీ పొడి పొట్లమేమో ఘుమఘుమ లాడు తూంది. దాన్నేంచేస్తారు? అమ్మ అయితే అమాంతం వీధిలోకి గిరవా టేయిస్తుంది. రహస్యం చెప్పేసి ఆయన వేసే చిందులు చూద్దామనే కుతూ హలాన్ని అతి కష్టం మీద అణుచుకున్నాను చిరునవ్వుతో. నా చిరు నవ్వుకి సమ్మోహితు డైపోయాడేమో, ఆయన 'అయితే బూరెముక్క ఎప్పుడు పెడతావే' అన్నాడు. ఆగితే ఇంకా ఏం మాట్లాడతాడోనని 'వస్తా నండీ' అని వడివడిగా నడుచుకుంటూ ఇంటికొచ్చేశాను. ఆ హడావిడిలో మరిచిపోయి ముందుగదిలోకి వెళ్ళబోయి ఎదురుగా అమ్మని చూసి జడుసు కుని దొడ్డిదోవని 'మూలగది'లోకి ప్రవేశించాను.

మరోసారి 'మూలగది'లో కూర్చుని పుస్తకం చదువుకుంటూం డగా ముందుగదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి. నాన్నగారి గొంతుతో బాటు మరొక పరిచితమయిన కంఠం. కాస్సేపటికి నాన్నగారు లోపలికి వచ్చి అమ్మతో 'ఒక కప్పు కాఫీ తీసుకురా, సుజా వాళ్ళ ప్రొఫెసరు వచ్చారు' అన్నారు. నా ముఖంలో నెత్తురుచుక్క లేదు మా ఇంటికి వచ్చిన మా ప్రొఫెసర్ని కలుసుకోకపోతే ఆయన ఏమనుకుంటారు! ఈ పరి స్థితిలో ఆయన ముందుకి ఎలా వెళ్ళగలను? తెలిస్తే రేపు ఆయన ముఖం క్లాసులో ఎలా చూడగలను? ఛీ,ఛీ, ఎంత సిగ్గుచేటు?— వెధవ ఆచారాలూ పీఖ్నాను-తిట్టుకుంటూంటే అమ్మవచ్చి 'ఏమిటే సణుగుతున్నావు' అంది.

'అవునూ, లేకపోతే ఏమిటి!మా ప్రొఫెసరు వచ్చారు. నేను ఇలా మూల కూర్చున్నాను. ఛీ,ఛీ' అన్నాను.

'బాగుంది వరస! బయటుంటే ఏం చేస్తావ్? పోనీ, వెళ్ళి ఓ పేము కుర్చీలో దూరంగా కూర్చుని మాట్లాడు. తరువాత కడిగించేస్తాను' అంది అమ్మ ఎంతో ఉదారంగా. 'అయినా ఆయన ఏమీ అనుకోడులే. నాన్నగారు ఆయనతో చెబుతూంటే విన్నాను' అంది పైగా.

'అయ్యబాబోయ్! చెప్పేశారా? తెలుగులోనే? నేను రేపు ఆయన ముఖం ఎలా చూడను?' అన్నాను ఏడుపుగొంతుతో.

'ఇదెక్కడి చిత్రమే! ఆయన పెళ్ళాం మాత్రం అవతలుండ దుటే!' అని అమ్మ బుగ్గలు నొక్కుకుంది.

ఆడదాన్నై ఎందుకు పుట్టానా అని ఆ క్షణంలో నా మనస్సు ఘోషించింది.

నా బి.యె. పరీక్షలయాక పెళ్లి సంబంధం స్థిరపడింది. ముహూర్తం పెట్టడానికి పురోహితుడు వచ్చాడు. అమ్మ, నాన్నగారూ పురోహితుడితో ముచ్చటిస్తున్నారు. నేను లోపల కూర్చుని జాకట్టు కుట్టుకుంటున్నాను. ఇంతలో అమ్మ లోపలికి వచ్చి 'నీకు నెల ఎప్పుడే' అని అడిగింది.

'ఎందుకు' అని అడిగాను ఆశ్చర్యంగా.

'ఎందుకేమిటి? ముహూర్తానికి అడ్డూ సొడ్డూ లేకుండా చూసుకోవద్దూ?' అంది.

'భగవంతుడా! ఎలాంటి సమస్య తెచ్చిపెట్టావయ్యా స్త్రీలకి! పండగలకీ, పబ్బాలకీ, శుభకార్యాలకీ—అన్ని పనులకీ అడ్డుపడే ఇలాంటి సమస్యనెందుకు సృష్టించావయ్యా మహానుభావా' అని మనస్సులో వాపోయి, పైకి 'ఇరవై అయిదవ తారీఖు' అన్నాను అమ్మతో.

అమ్మ సావిట్లోకి వెళ్లి పురోహితుడితో మళ్లీ ఏదో తర్జన భర్జన చేయటం వినిపించింది. మధ్య మధ్య మాటల్లో తేలినదేమిటంటే, అమ్మకి కూడా ఇబ్బంది లేకుండా ఉండేట్లు ముహూర్తం నిశ్చయించమంటూందని.

'మరి వాళ్ళ అత్తగారి గురించీ, ఆడబడుచుల గురించీ కనుక్కో-వద్దూ?' అన్నారు నాన్నగారు అసహనంగా.

'అవును మరీ, కనుక్కో-వద్దూ' అంది అమ్మ తాపీగా సాగదీస్తూ.

వారంరోజులు ఇరుపక్షాల మధ్యనూ సంప్రదింపులు జరిపిన అనంతరం చచ్చిచెడి ముహూర్తం కుదిర్చారు. వాళ్ళు కుదిర్చినదాన్ని బట్టి పెళ్ళయిన వారం తిరక్కుండా నేను కూర్చోవాలి. దిగమింగి ఊరుకున్నాను.

పెళ్ళిలో మగపెళ్ళివారి తరఫున ఇద్దరు ముగ్గురు స్త్రీలు అవతలికి చేరారు. వాళ్ళకి పిలుపు సరిగ్గా అందలేదనీ, కాఫీ టిఫిన్లు సరిగ్గా అందలేదనీ అలిగి కూర్చున్నారుట. పెళ్ళిలో అదొక సందడి-నలుగురూ ముచ్చటించుకోవటానికి. అప్పగింతల టైముకి అనుకోకుండా మా అత్తగారు అవతలికి చేరారు. వారంరోజులు దిగించిందిట. అప్పగింతలు ఆవిడ చేతికి జరగలేదని ఆవిడ కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకున్నారు.

పెళ్ళయిన మరునాడే బంపలుదేరి ఆయనతో కలిసి హైదరాబాదు వచ్చేశాను. మనుగుడుపులు, సత్యనారాయణవ్రతం వగైరాలకు ఆయనకు సెలవు లేదని ఖచ్చితంగా చెప్పి వచ్చేశారు. ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

వచ్చి రెండురోజులైంది. ఆయన సాయంకాలం ఆఫీసునుంచి వచ్చే టప్పుడు వాళ్ళ కొలీగ్స్ ఇద్దర్ని కూడా తీసుకువచ్చారు. గంట క్రితం నుంచీ ఆయన ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్నాను. తలనొప్పి కూడా వచ్చింది. ఇంట్లో ఏదీ ముట్టుకోకుండా ఒక బల్లమీద కూర్చున్నాను. కొలీగ్స్‌ని ముందు గదిలో కూర్చోబెట్టి ఆయన లోపలికి వచ్చారు. 'ఏం అలా ఉన్నావు' అన్నారు నన్ను చూసి, దగ్గరగా వస్తూ. నేను దూరంగా వెనక్కి జరిగి 'ఇంట్లోకి రాకూడదు' అన్నాను.

'వ్హాట్!' అన్నారు. నేను సిగ్గుపడుతూ తలవంచుకున్నాను.

'నీ కేమన్నా మతిపోయిందేమిటి! ఇంకా పురాణకాలంలో ఉన్న ట్టున్నావ్. ఇప్పుడు నువ్విలా కూర్చుంటే నేను కాఫీ కాచి తీసికెళ్ళి వాళ్ళ కివ్వనా? నా పరువేమన్నా నిలుస్తుందా? నీకు అంతగా కూర్చోవాలనుంటే ఇంకెప్పుడైనా నిన్ను కూర్చోబెట్టి వంటచేసి పెడతాలే-ఇప్పుడు మాత్రం-ఊఁ-పదపద-ఛీ-మనిద్దరి మధ్యనూ ఈ ఆచారాలేమిటి!' అని నన్ను మరోమాట మాట్లాడనీయకుండా వంటింట్లోకి రెక్క పుచ్చుకుని తోసుకు వెళ్ళారు.

అంతా బాగానే ఉంది. రోజులు హాయిగా గడుస్తున్నాయను కున్నాను. ఓరోజు సాయంకాలం తలుపు చప్పుడైంది. ఆయన ఆఫీసు నుంచి వచ్చే టైము ఇంకా కాలేదు. పనిమనిషి వెళ్ళి చాలాసేపయింది. వంట పూర్తిచేసి అప్పుడే స్నానంచేసి ఫుల్ వాయిలు చీర కట్టుకుని, మొహానికి పౌడరు రాసుకుని బొట్టు పెట్టుకుంటున్నాను. తలుపు చప్పు డైంది. వెళ్ళి తలుపు తీస్తే ఎదురుగా పక్కింటి సరోజ అత్తగారు. అప్పుడప్పుడు సరోజ రావడమే గాని, వాళ్ళ అత్తగారు ఎప్పుడూ రాలేదు. సంతోషంగా 'రండి, పిన్నిగారూ' అని ఆహ్వానించాను. ఆవిడ ఏ గలేబూ లేని కర్ర కుర్చీ ఏర్చుకుని కూర్చుంది.

'కాఫీ తీసుకుంటారా?' అన్నాను.

'అబ్బే. నేనలాంటివి తాకనమ్మా' అంది.

మా పుట్టింటి గురించీ, అత్తవారి గురించీ ఇవీ ఆవీ అడిగితే అన్నిటికీ సమాధానాలు చెప్పాను.

'నీళ్లోసుకున్నావా?' అంది నా వైపు పరీక్షగా చూస్తూ.

'మరేనండీ—ఇప్పుడే. బొట్టుపెట్టుకుంటూండే మీరొచ్చారు' అన్నాను.

ఆవిడ నవ్వుతూ 'అబ్బే, స్నానం మాట కాదు నేనడిగేది. నెల తప్పిందా అని' అంది.

నేను సిగ్గుపడిపోయాను. 'అబ్బే, లేదండీ', అన్నాను చిరునవ్వుతో.

ఆవిడ వెంటనే సీరియస్‌గా ముఖంపెట్టి 'నువ్వొచ్చి నెలపైనే అయినట్లుంది—ఇంకా బయట ఉండకపోతేనూ అనుమానం వచ్చింది' అంది.

నేను నిర్ఘాంతపోయాను. క్షణం సేపు తేరుకోలేదు. ఏం సమాధానం చెప్పాలో స్ఫురించలేదు వెంటనే.

'ఎగించిందేమోలే' అంది ఆవిడే. నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది ఆవిడ మాటలకి.

'మరేనండీ, నాకు ఎప్పుడూ అంతే. సరిగ్గా నెలకి ఎప్పుడూ కాదు' అన్నాను, అప్పటికి ఆ గండం గడిచిపోయింది కదా అని.

ఆవిడ ఆదుర్దాగా అంది 'అయ్యో, అలాగా? అటువంటివి అశ్రద్ధ చెయ్యకూడదమ్మా. వెంటనే డాక్టరుకి చూపించుకో. వెనకటికి మా వాళ్ల

మ్మాయికి ఇలాగే కడుపు, కడుపు అని కూర్చున్నారు. చివరికది కంతి అని తేలింది.'

ఈ ప్రసంగం ఎలా మార్చాలా అని ఆలోచిస్తూ ఇటూ అటూ ఇబ్బందిగా కదిలాను నేను. అంతలో అదృష్టవశాత్తు ఆయన ఆఫీసు నుంచి వచ్చేశారు. ఆవిడ మళ్ళీవస్తాలెమ్మని వెళ్ళిపోయింది.

కాఫీ తాగుతూ ఆయనతో చెప్పాను పక్కింటావిడ అడిగిన సంగతి. చెప్పి, 'ఎలాగండీ ఇప్పుడూ ? నెల నెలా ఆవిడ తారీఖులు లెక్కపెడు తూంటేనూ ?' అన్నాను.

'ఆవిడ లెక్కలు వేసుకుంటే వేసుకోనీ. నువ్వు ఆవిణ్ణి లెక్క చెయ్యకు' అన్నారు ఎంతో సునాయాసంగా.

'అలా కొట్టిపారేస్తే ఎలాగు— ఇరుగు పొరుగూ అన్నాక ?'

ఆవిడ నీకు పినతల్లి అనా—పెద్దత్తగారనా, ఏమవుతుందని పట్టించుకోవటం ? మా ఇంట్లో పద్ధతి ఇంతే. నేను అవతల కూర్చోను అని ఖచ్చితంగా చెప్పు' అన్నారు.

'మీ మగవాళ్ళంతా ఇంతే. అన్ని పాయింట్లూ ఆలోచించరు. రేపొద్దున్న అత్తగారు గాని, మా అమ్మగాని వస్తే ఆవిడ వాళ్లతో చెప్పదూ ?'

'అప్పటి మాట చూసుకుందాంలే' అన్నారు.

'అలా అంటే ఎలా?' అన్నాను విసుగ్గా.

'పోనీ, ఒక చక్కని ఉపాయం చెప్పనా?' అన్నారు కాఫీ కప్పు ఖాళీచేసి టేబుల్ మీద పెడుతూ.

'ఏమిటి?' అన్నాను ఉత్సాహంగా.

'నీళ్లు పోసుకో' అన్నారు కొంటెగా నవ్వుతూ.

'మీ హాస్యానికేం గాని, వేరే ఇల్లు చూద్దురూ మీకు పుణ్యం ఉంటుంది. మన వాళ్ళెవరూ చుట్టుపక్కల లేనిచోటు చూడండి' అన్నాను

'నీకు మతి పోయింది. ఇటువంటి సిల్లీ విషయంకోసం ఇల్లు మార్చాలా? ఇల్లు దొరకటం అంత సులభం అనుకుంటున్నావేమిటి?'

'అలా అయితే అవతల కూర్చుంటాను, వండుకు తినండి' అన్నాను బెదిరిస్తూ.

'అలా అయితే మీ పుట్టింటికి పంపించేస్తాను' అన్నారు వెనకటి కాలం మొగుడిలా.

అదృష్టవశాత్తు, వారం తిరక్కుండా మా సమస్య పరిష్కృతం అయిపోయింది. ఆయనకి ఢిల్లీ ట్రాన్స్‌ఫర్ అయింది. నేను ఎగిరి గెంతేశాను కబురు విని.

మేము ఢిల్లీ మహానగరంలో చచ్చిచెడి రెండు గదుల వాటా ఒకటి అద్దెకి సంపాదించాం. ఇంటివాళ్ళు పంజాబీలు. వాళ్ళకి మన ఆచారాలు లేవు. మా ఇంటి సందులోనే మరో తెలుగువాళ్ళు కూడా ఉన్నారు. మధ్యమధ్య బజారులో కలుసుకోవటం అలవాటై క్రమంగా ఇంటికి వెళ్ళేటంత స్నేహం కలిగింది.

ఓసారి మాటల సందర్భంలో ఆ తెలుగావిడ మూర్తిగారి భార్య నాతో 'ఏమిటోనండి, సుజాతగారూ, వెధవఢిల్లీ వదిలేసి వెళిపోతే బాగుండు ననిపిస్తోంది' అంది. నేను ఆశ్చర్యపోతూ 'అదేమిటండీ, ఇంత చక్కని

పట్టణం! నేను ఢిల్లీ వచ్చినందుకు ఎంత సంతోషిస్తున్నానో తెలుసా? ఆంధ్రదేశం నుంచి బయటపడ్డందుకు ఎంత ఆనందంగా ఉందో నాకు!' అన్నాను.

'అయ్యో. మీకు అనుభవం లేదండి, బాబూ, ఒక్క శీతాకాలం గడపండి ఇక్కడ-తెలుస్తుంది మీకే. మీరింకా ఇక్కడి కొచ్చి ఆర్నెల్లు కాలేదు. చుట్టాలూ పక్కాలూ క్రమంగా ఇక మొదలుపెడతారు రావటం. ఒకటి రెండు గదుల్లో వచ్చిన అతిథులతో ఎలా ఉండటమో మీకే తెలిసివస్తుంది. అందులోనూ చలికాలం యమ నరకం అనుభవించాలనుకోండి. మా అత్తగారు చలికాలంలో నన్ను ప్రాణాలు తినేస్తారు. నేలమీద బయట కూర్చోవటమేకాక, చాపమీద పరుపు లేకుండా, రొజాయి కప్పుకోకుండా పడుకోవాలి. అవన్నీ తీసుకుంటే తడపలేము కదా. చాకలికి వేసేవి అంతకన్నా కాదు. నులకమంచం తీసుకుంటే దాని ప్రతితాడూ తడిసేలాగున కడగాలంటారు. దాన్ని తడపటానికి నాలుగు బిందెల నీళ్ళు కావాలి. ఒక్కచుక్క చుట్టుపక్కల వస్తువుల మీద చిందకూడదు. ఈ బాధంతా భరించలేక చాప తీసుకుంటే ఒళ్ళునొప్పులు. ఆ మూడురోజులూ వాడుకున్న బట్టలు చాకలివాడొచ్చే వరకూ ఏ మూలనోపెట్టి, వాణ్ణి విడిగా తీసుకోరా అంటే వాడు సణుగుతాడు. ఏమీ ఎరగనట్లు 'వాటిని కూడా తీసుకో' అంటే ఆ బట్టల్నీ తీసుకొచ్చి తక్కిన మాసిన బట్టలతో కలిపేస్తాడు. అన్నిటినీ ముట్టుకుని ఏ గుమ్మం తెరలకో, టేబుల్ గుడ్డకో తగులుతూ వెడతాడేమోనని మా అత్తగారి భయం. అందుకని ఇంట్లో తలుపులికీ, బల్లలికీ గుడ్డల్లేకుండా జాగ్రత్త పడతారు. చాకలి వెళ్ళిపోయాక ఇల్లంతా పసుపునీళ్లు చల్లి ఆ తరవాత రెండుబిందెల నీళ్ళతో కడుగుతారు.'

'ఇటువంటి మహాపట్నాల్లో కూడా ఇలా ఆచారాలు సాగాలంటే కష్టం, కాస్త సర్దుకోవాలమ్మా, మడి, ఆచారం మరచిపోవాల్సిన రోజులివి' అని ఆయన ఎప్పుడైనా విసుక్కుంటే, మా అత్తగారు 'ఏమోరా, మా తరం ఇలా వెళ్లిపోవాల్సిందే అంటారు' అని మూర్తిగారి భార్య మొత్తుకుంది.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు చాలాసేపటి దాకా. పట్టిన నిద్రలో కూడా పీడకలలు.

మా అమ్మ ఇంట్లోనే ఉంది. ఆయన ఎవరినో పార్టీకి పిలిచారు ఇంటికి. చేతినిండా బోలెడుపని. సరిగ్గా ఆ టైముకి—అవటానికి రెండు రోజులు ముందుగానే—అయిపోయాను. ఒంట్లో బాగుండకపోయినా ఒకమూల చాపవేసుక్కూర్చునే పరిస్థితి కాదు. ఆ పార్టీకి వాళ్ళ ఆఫీసు వాళ్ళనీ, ఎవరో ఒకరిద్దరు విదేశీయుల్నీ పిలిచారు. రహస్యం బయట పెట్టకుండా హడావిడిగా టిఫిన్లు వగైరా చేస్తున్నాను. ఇంక అతిథులొచ్చేందుకు అట్టే టైము లేదు. ఈయన వచ్చి 'డ్రెస్సుమార్చుకో, టైమైపోయింది' అన్నారు. గబగబా అన్నివస్తువులూ సర్దేసి గదిలోకి వెళ్లాను డ్రెస్సు మార్చుకుందామని. అవతల గడియవేసిన చప్పుడైంది. నేను లోపల ఉన్నాననీ, తలుపు తీయమనీ కేకేశాను. అవతలినుంచి 'నువ్వు ఇవతలికి రావటానికి వీల్లేదు, ఆ గదిలోనే ఉండు' అని గదమాయింపు వినిపించింది. అది అమ్మ కంఠం.

'నేను ఈ గదిలో కూర్చోలేను—బయటి కొచ్చేస్తాను—స్నేహితులందరూ ఇంటికొస్తున్నారు—అందరినీ సత్కరించాలి—సరదాగా వాళ్ళతో కూర్చుని కబుర్లు చెప్పాలి—ఇక్కడ గదిలో మూలకూర్చుంటే ఎలా' అంటూ తలుపు బాదాను.

'వీల్లేదు. నువ్వు ఆ మూల నుంచి బయటికి రావటానికి వీల్లేదు. నేను ఇంట్లో ఉండగానే ఇల్లు మైలచేస్తావుటే—ఎంత బరితెగించిపోయావే' అని కర్కశంగా అరిచింది అమ్మ.

అతిథులొచ్చేవేళ అయిపోయింది. నాకు అదుర్దా ఎక్కువైపోయింది. 'అమ్మా, తలుపుతెరు—నన్ను ఇవతలికి రానీ-ఏమండీ-తలుపు తియ్యండి -నన్ను విడిపించండి-నన్ను విడిపించండీ' అని వెర్రిగా అరిచాను.

'ఏమిటి సుజా, ఏమిటి' అంటూ నన్ను పట్టుకుని కుదిపారు ఆయన. దాంతో మెలుకువ వచ్చింది. మెల్లిగా పీడకల అంతా గుర్తొచ్చింది. ఆయనకి అంతా చెప్పాను. ఆయన జాలిగా నవ్వారు.

'నువ్వు మరీ సెన్సిటివ్. స్వల్పవిషయాల గురించికూడా అదే పనిగా ఆలోచించి బాధ పడతావు. ఒకపక్క పెద్దవాళ్లన్నా, ఆచార వ్యవహారాలన్నా గౌరవమూ, భయమూను—మరోపక్క నీ ఇష్టానికి వ్యతిరేకంగా వెళ్ళకూడదని పట్టుదల—ఈ రెండింటి మధ్యనూ నువ్వు నిత్యం నలిగిపోతున్నావు. నవ్యమార్గాన్ని నీకు నచ్చిన మార్గాన్ని అనుసరించాలంటే ఎప్పుడో ఒకప్పుడు ధైర్యంచేసి పెద్దవాళ్లకి ఎదురుతిరగటం తప్పదు. మనం భయపడుతున్నకొద్దీ వాళ్ళు తమ మార్గాన్నే అనుసరించమని నిర్బంధిస్తారు. వాళ్ళ మార్గాన్ని అనుసరించనంత మాత్రాన వాళ్ళ మీద మనకి గౌరవం, ప్రేమ లేవనుకుంటే అది వాళ్ళ కర్మ అని వదిలెయ్యాలి' అని బోధిస్తూ నన్ను సముదాయించారాయన. ఆయన చెప్పిన సలహాయే పాటించా లనుకున్నాను.

మా అమ్మ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. తీర్థయాత్రాస్పెషల్‌లో ఇరుగు పొరుగు వాళ్ళతో కలిసి ఉత్తర హిందూస్థానం చూడటానికి తను బయలుదేరుతున్నట్లూ, ఢిల్లీ వచ్చి నా దగ్గర ఇరవై రోజులుండి,

తను విడిగా ఒక్కర్తే తిరిగి వెళిపోతానన్నట్లూ అమ్మ ఉత్తరంలో రాసింది. అమ్మ ఏ తారీఖున ఢిల్లీ వస్తుందో చూసుకుని 'అమ్మయ్య' అనుకున్నాను. అప్పటికి నా అడ్డం తీరిపోతుంది. తను ఉండేది ఇరవై రోజులే కాబట్టి నేను అవతల కూర్చోనక్కర్లేదు అని సంతోషించాను. 'నీ రాక కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నాను' అని ఉత్తరం రాసేశాను.

అమ్మ వచ్చి మా ఇల్లు చూసి ఆశ్చర్యపోయింది. 'మీ ఆయన పెద్ద ఆఫీసరు కదా-రెండు గదుల ఇల్లేమిటే— శుభ్రంగా ఓ బంగళా తీసుకోక!' అంది. 'ఇక్కడ ఇల్లు దొరకటం చాలా కష్టం. జనం ఎక్కువ. ఈ రెండు గదులకే రెండువందల యాభై ఇస్తున్నాం' అన్నాను నేను. మా అమ్మ నోరు తెరిచి కొంచెంసేపు అలాగే ఉండిపోయింది.

కాస్సేపటికి తేరుకుని 'అవునుగాని, అమ్మాయ్, అవతలుంటే ఎక్కడ కూర్చుంటావ్-గదుల నిండా గుమ్మాలకీ కిటికీలకీ తెరలుకూడా కట్టావు' అని అనుమానం వెలిబుచ్చింది.

'అదేనమ్మా, చచ్చిపోతున్నాను. ఢిల్లీలో కూర్చోవటానికూడా చోటు ఉండదు. చలికాలం నానా ఇబ్బందీను' అని దీనంగా మొహం పెట్టాను.

'స్నానం ఎప్పుడైందీ?' అని అడిగింది. ప్రిపేరయిన క్వశ్చన్ పరీక్ష పేపర్లో వచ్చినట్లు తడుముకోకుండా సమాధానం చెప్పాను— అయిదు రోజులైందని. 'ఊఁహూఁ' అంది సాలోచనగా.

అమ్మకి ఢిల్లీ అంతా చూపించాను—లక్ష్మీనారాయణ మందిరం, పార్లమెంటు భవనం, ఇండియా గేట్, వేంకటేశ్వర స్వామి ఆలయం,

రెడ్‌ఫోర్ట్, డాల్స్ మ్యూజియమ్—మొదలైనవన్నీ. తిరిగి వెళ్లే రోజులు దగ్గర కొచ్చాయి. మళ్ళీ రిజర్వేషను దొరకటం కష్టమవుతుందని ఆలోచించి, అడగటం మర్యాద కాకపోయినా అడిగాను—'అమ్మా, టిక్కెట్టు ఏ తారీఖుకి రిజర్వ్ చేయించమంటావు' అని.

అమ్మ రెండు నిముషాలు ఆలోచించి 'నేను ఇక్కడికి వచ్చేటప్పటికి ముందు అయిదు రోజులైందన్నావు కదూ నీకు స్నానమై. నేనొచ్చి పది హేను రోజులైందా. ఇంకో వారం పోతే నీకు మళ్ళీ రోజులాయెను. నువ్వు అవతల కూర్చుంటే అల్లుడు ఇబ్బంది పడాలి. చూస్తూ చూస్తూ మిమ్మల్ని ఎలా అవస్థ పెట్టను ? నీ స్నానం అయినాకే వెడతాలే' అంది.

'హతోస్మి ! ఈ వలలోంచి నువ్వు తప్పించుకోలేవు' అని మూలిగింది నా మనస్సు !

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21.2.73)